క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక తిరుమల వీధి కూడలిలో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయం 13వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సుడా మాజీ చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత, పంచాయతీ వార్డు సభ్యుడు కేసీహెచ్‌బీ గుప్తలతో పాటు పలువురు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భాస్కరబట్ల జగదీష్ బాబు భక్తులచే పూజలు చేయించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆధార్ నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్‌కుమార్

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన టీహెచ్‌ఆర్, ప్రీ స్కూల్ పిల్లలకు తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించాలని ఎంపీడీవో మోహన్ కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆధార్ నమోదుపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఆధార్ నమోదు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రతిరోజూ 5 సచివాలయాలు చొప్పున ఆధార్ నమోదు చేయనున్నారన్నారు. ఆయనతో పాటు సీడీపీవో హెచ్‌కే కామాక్షి ఉన్నారు.

ఏకగ్రీవంగా డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ఎన్నికలు



చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు తదితరులు

నరసన్నపేట: స్థానిక వంశధార సబ్ డివిజన్ పరిధిలోని మూడు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు మంగళవారం ఎన్నికలు సజావుగా పూర్తి చేశామని ఈఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. నరసన్నపేట డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా శిమ్మ చంద్రశేఖర్, పర్లాం డీసీ చైర్మన్‌గా కింజరాపు సత్యనారాయణ, పోలాకి డీసీ చైర్మన్‌గా మిరయప్పల్లి వెంకటప్పలనాయుడులు ఎన్నికయ్యారని పేర్కొన్నారు. అలాగే మిగిలిన కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. చైర్మన్లను ఎమ్మెల్యే ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అభినందించారు.

పొందూరు: నీటి సంఘాల ఎన్నికల్లో అత్యంత కీలకమైన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో గోరింట డిస్ట్రిబ్యూటరీకి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బొడ్డేపల్లి నీటి సంఘం అధ్యక్షుడు దుప్పల జగన్మోహనరావు, ఉపాధ్యక్షుడిగా అన్నెపు జనార్ధనరావులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో గోరింట, పెనుబర్తి, కింతలి, బొడ్డేపల్లి నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

40 శాతం పశు గణన పూర్తి



ఏడీ కార్యాలయంలో జేడీ మురళీధర్

సారవకోట: జిల్లాలో 40 శాతం పశు గణన పూర్తి చేసినట్లు పశు సంవర్ధక శాఖ జేడీ ఆర్. మురళీధర్ తెలిపారు. మండలంలోని కొమ్ముసరియాపల్లి పశు వైద్య కేంద్రం, అక్కడ నిర్మిస్తున్న గోకులంను మంగళవారం ఆయన సందర్శించి, అనంతరం సారవకోట ఏడీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి శతశాతం గణన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో 1,134 గోకులాలు మంజూరు చేశామని, వాటిలో 1,100 వరకు పనులు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆ నిర్మాణాలు పూర్తయితే అదనంగా మరో 700 గోకులాలు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఆయనతో పాటు ఏడీ ఎం.లోకనాథ, పశు వైద్యాధికారి చల్లా కిషోర్ ఉన్నారు.

అధ్యక్షుడిగా పాపారావు



పాపారావుకు నియామకపత్రం అందిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

సారవకోట: మండల సర్వేయర్ల సంఘం అధ్యక్షుడిగా కిడిమి సచివాలయ సర్వేయర్ రావాడ పాపారావు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా సర్వేయర్ల సంఘం సూచన మేరకు స్టేట్ కో–ఆర్డినేటర్ లోకేష్ ఆధ్వర్యంలో మండల సర్వేయర్ల సంఘం ఎన్నిక జరగగా పాపారావు ఎన్నికైనట్లు తహసీల్దార్ విజయలక్ష్మి, మండల సర్వేయర్ రామకృష్ణలు నియామకపత్రం అందజేశారు.

మొక్కజొన్నపై మక్కువ..!



మిరియాపల్లి వద్ద ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట

- రబీలో విస్తారంగా సాగు
- పాతపట్నం నియోజకవర్గంలో 2,830 ఎకరాల్లో పంట
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని రైతులు రబీలో మొక్కజొన్న సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇతర ఆరుతడి పంటలకు బదులుగా మొక్కజొన్నపైనే మక్కువ చూపుతున్నారు. దీనిలో భాగంగా పంటను పొలాల్లో వేసుకునేముందు వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. గతంలో ఖరీఫ్ వరి కోత తర్వాత నూనె గింజల పంటల్లో ప్రధానంగా చెప్పుకునే వేరుశనగ, నువ్వు, కట్టి జనుమ వంటి పంటలను రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుండేవారు. కానీ ఇప్పుడు అత్యధికంగా



లక్ష్మీనర్సుపేట వద్ద సాగులో ఉన్న మొక్కజొన్న

మొక్కజొన్న సాగుచేస్తున్నామని రైతులు చెబుతున్నారు. కోళ్లు, పాడి పశువులు, చేపల మేతగా మొక్కజొన్నకు మంచి గిరాకీ ఉండటంతో సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

సాగునీటిపై సందిగ్ధం

ఈ ఏడాది రబీలో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్న వాణిజ్య పంటలకు సాగునీరు అందివ్వాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రైతులు రెండో పంట వేయవద్దని, రెండో పంటకు సాగునీరు అందివ్వలేమని కొన్ని రోజుల క్రితం ప్రకటించారు. దీంతో అప్పటికే వాణిజ్య పంటలను వేసిన రైతులు సందిగ్ధంలో పడిపోయారు. అధికారులు, పాలకులు రైతులకు నష్టం లేకుండా రబీలో సాగు చేస్తున్న పంటలకు ఏప్రిల్ వరకు సాగునీరు అందివ్వాలని కోరుతున్నారు.

జీవనదుల చెంతన

పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాలను కలుపుతూ వంశధార నది, మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం మండలాలను కలుపుతూ మహేంద్రతనయ నదులు ఉన్నాయి. రెండు నదుల తీర గ్రామాల్లో మొక్కజొన్న సాగు ఇలా ఉంది.

మండలం	ఎల్ఎన్‌పేట	హిరమండలం	పాతపట్నం	మెళియాపుట్టి	కొత్తూరు
గతేడాది విస్తీర్ణం(ఎకరాల్లో..)	350	180	532	415	480
ప్రస్తుతం విస్తీర్ణం(ఎకరాల్లో..)	580	325	650	625	650

రెండేళ్లుగా మొక్కజొన్న సాగు



రెండేళ్ల క్రితం వరకు తక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న వేశాను. అయితే ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. మొక్కజొన్న పంటకు యాజమాన్య పద్ధతులు పాటించి, సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. మొక్కజొన్నకు మార్కెట్‌లో గిరాకీ ఎక్కువగా ఉందని భావించి ఈ పంట సాగుకు ఎక్కువ మంది రైతులు ముందుకు వచ్చారు.

–అశోక్‌కుమార్ పాణిగ్రహి, రైతు, లక్ష్మీనర్సుపేట

విస్తీర్ణం పెరిగింది



వంశధార నదీతీర గ్రామాల్లో మొక్కజొన్న సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. గతంతో పోల్చితే ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. నదీతీరంలో వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. మొక్కజొన్న పంట సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కలిగిస్తున్నాం. అందుకే రైతులు వాణిజ్య పంటలను అధికంగా పండిస్తున్నారు.

–పైడి లతశ్రీ, ఏవో, ఎల్ఎన్‌పేట

ఆదమరిస్తే అంతే



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస నుంచి పురుషోత్తపురం వరకు ఉన్నటువంటి ఆర్ అండ్‌బీ రహదారిలో పాలవలస వద్ద రహదారి కల్వర్ట్‌కు రక్షణ గోడ లేకపోవడం వలన ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో ఒకేసారి మలుపుతో పాటు కల్వర్టు లేకపోవడంతో రాత్రి వేళలో వాహనాలు ఏమాత్రం పక్కకు వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. అందువలన తక్షణమే అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. **- సరుబుజ్జిలి**

గోతులమయం



మెళియాపుట్టి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గోతులమయంగా మారాయి. దీంతో వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి గొప్పిలి, గోకర్ణపురం తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఒడిశా గారబంద గ్రామం మీదుగా వెళ్తున్నారు. వసుంధర గొప్పిలి వద్ద రహదారి గోతులమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. **- మెళియాపుట్టి**

కళ్లలోకి ఇసుక



సారవకోటలో ఇసుకతో వస్తున్న ట్రాక్టర్లపై టార్పాలిన్లు కప్పకపోవడంతో రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం శీతల గాలులు వీస్తుండడంతో ఇసుక కళ్లలో పడుతోంది. దీనివలన ప్రయాణికులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. అందువలన అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- సారవకోట**

ధరల పెరుగుదలే కూటమి సాధించిన ప్రగతి

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కూటమి సాధించిన విజయం ఏదైనా ఉందంటే అది ధరల పెరుగుదలేనని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. కూటమి పాలనలో నిత్యావసర సరుకులు, కూరగాయాలు, వంట నూనెలు, పప్పులు అన్ని ధరలు పెరిగిపోతున్నాయన్నారు. మరోవైపు విద్యుత్ ఛార్జీలు పెరిగాయన్నారు. చంద్రబాబు ఎంతో తెలివిగా చలికాలంలో విద్యుత్ ఛార్జీలు పెంచారని అన్నారు. చలికాలంలో ప్రతీ ఇంట్లోను విద్యుత్ వినియోగం తగ్గుతుందని, ఈ సమయంలో ఛార్జీలు పెంచితే వినియోగదారులు అంతగా గుర్తించలేరన్నారు. ధరలు పెరిగినంతగా సామాన్య, మధ్య తరగతి, పేద కుటుంబాలకు చెందిన వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడలేదని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ పూర్తయినా రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వలేని దౌర్భాగ్యంలో కూటమి నాయకులు ఉన్నారని మండిపడ్డారు. అమలు సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన చంద్రబాబు అన్ని వర్గాల వారిని మోసం చేస్తున్నారన్నారు.

ఆక్రమణలు తొలగింపు



నరసన్నపేట: ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



జలుమూరు: ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

జలుమూరు: మండలంలోని చిన్నదూగాం పంచాయతీ పరిధి కాకర్ల చెరువులో ఆక్రమణలను రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం తొలగించారు. చెరువు ఆక్రమణలపై గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ తరుపున న్యాయవాది డాక్టర్ డీ.వి.రావు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో నాలుగేళ్లు పోరాటం చేశారు. అయితే గ్రీన్ ట్రిబ్యునల్ ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు ఇచ్చినా రాజకీయ ఒత్తిళ్లతో సాధ్యం కాలేదు. దీంతో హైకోర్టు జోక్యం చేసుకొని ఆదేశాలు ఇవ్వడంతో తహసీల్దార్ జెన్ని రామారావు, సీఐ జె.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో యంత్రాలతో ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణలు తొలగించిన ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

నరసన్నపేట: పట్టణంలోని కాలేజీ రోడ్డులో కూరగాయల వ్యాపారి వారణాసి గణేష్ చెరువును ఆక్రమించి షాపు నిర్మాణం చేస్తుండగా పంచాయతీ సిబ్బంది మంగళవారం అడ్డుకున్నారు. నిర్మాణం చేసిన షాపును తొలగించారు. సోమవారం రాత్రి సమయంలో దౌర్జన్యంగా రాజుల చెరువులోనికి షాపును విస్తరించి పనులు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఈవో ద్రాక్షాయిణి వెంటనే వెళ్లి పనులను ఆపించారు. అయితే మంగళవారం ఉదయం మళ్లీ పనులు చేపట్టడానికి ప్రయత్నాలు చేస్తుండగా, విస్తరణ చేసిన భాగాన్ని పంచాయతీ సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులతో గణేష్ వాగ్వివాదానికి దిగారు. అయితే రాజుల చెరువులో ఎటువంటి నిర్మాణాలకు అనుమతి లేదని, మళ్లీ పనులు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఈవో హెచ్చరించారు. అలాగే రోడ్లుపై కూరగాయల వ్యాపారంతో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలిగించవద్దని వ్యాపారులకు సూచించారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖాధికారి త్రినాథస్వామి

ఆమదాలవలస: రబీలోని అపరాల పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేట రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రబీ అపరాల పంటలపై రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం నూర్పులు చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి రానున్న రెండు రోజుల్లో జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని, ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ ఎ.బగ్గు రజిని, మండల వ్యవసాయ అధికారి ఎం.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకర్

నరసన్నపేట: గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని డ్వామా పీడీ బి.సుధాకర్ అన్నారు. మండలానికి మంగళవారం వచ్చిన ఆయన నరసన్నపేట టౌన్‌లో పరిధిలో విజయలక్ష్మీనగర్, మారుతీ నగర్‌లో చేపట్టిన పనులను పరిశీలించారు. మండలంలో 18 పనులకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. వీటిలో మూడు పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని, వెంటనే ప్రారంభించాలని సంబంధిత ఇంజినీర్లు, ఆయా ప్రాంత ప్రజాప్రతినిధులకు సూచించారు. పూర్తి చేసిన పనులకు వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఏపీవో యుగంధర్ మాట్లాడుతూ రానున్న సీజన్‌లో ఉపాధి పనులు బాధ్యతగా చేపట్టాలని, వేతనదారులందరికీ పనులు కల్పించాలని సూచించారు.

జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాతపట్నం: శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు కోరారు.

మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఎస్టీ వసతి గృహం వద్ద రాష్ట్ర మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఉన్న యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు డి.దేవేంద్ర, ఆదినారాయణ, శివ, త్రినాథ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పరీక్షలు నిర్వహించాలి



హిరమండలం పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: పాఠశాలల్లో ఎస్ఏ-1 పరీక్షలు పక్కాగా నిర్వహించాలని ఎంఈవో కె.రాంబాబు ఆదేశించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీంతో మంగళవారం చాలా పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులకు కీలక సూచనలు చేశారు. పరీక్షల నిర్వహణలో లోపాలకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాలన్నారు. ప్రశ్నాపత్రాల జారీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

హిరమండలం: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని హెచ్ఎం బి.గొల్లవాడు అన్నారు. మండలంలోని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న త్రిపురాన లావణ్య, ఏడో తరగతి చదువుతున్న సాసుపల్లి జస్మితల పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయం పరిశీలన

బూర్జ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని ఎంపీపీ కర్నేన దీప మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కె.సునీతను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గ్రంథాలయంలో అత్యవసరంగా టాయిలెట్, ప్రహరీ నిర్మాణం, కిటికీలు, ప్రధాన తలుపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమెతో పాటు సర్పంచ్ ఏగు అనురాధ, పాఠకులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యదర్శుల నూతన కార్యవర్గం

హిరమండలం: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ విస్తరణ అధికారి గోవిందరావు అధ్యక్షతన ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.శేఖర్‌రావు, ఉపాధ్యక్షుడిగా టి.సుధారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎం.కూర్మారావు, కోశాధికారిగా పి.దశరథ, జాయింట్ కార్యదర్శిగా జి.శ్రవంతి, గౌరవ అధ్యక్షుడిగా దిలీప్ కుమార్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

త్వరితగతిన పనులు చేపట్టాలి



చెరువు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

బూర్జ: స్థానిక దిగంబర చెరువు పనులు త్వరితగతిన చేపట్టాలని ఎంపీపీ కర్నేన దీప అన్నారు. చెరువును ఎంపీడీవో ఆర్.తిరుపతిరావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. అమృత సరోవర్‌లో భాగంగా సుందరీకరణ పనులు చేపట్టేందుకు కృషి చేయాలని కోరారు. పంచాయతీ నిధుల నుంచి రూ.3 లక్షలు, ఎంపీపీ నిధుల నుంచి రూ.3 లక్షలతో చెరువు పనులు ప్రస్తుతానికి ప్రారంభించేందుకు అధికారులు అంగీకరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, పీఆర్ జేఈ సీహెచ్ మణికంఠ, స్థానిక సర్పంచ్ ఏగు అనురాధ, ఏపీవో బి.నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి బి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే

ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో పెన్షనర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పలువురు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. పెన్షన్ కోసం డీఎస్ నఖారా చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. బకాయి పడ్డ పాత డీఏలు చెల్లించాలని కోరారు. అలాగే విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎస్‌టీవో కొండలరావు



పాతపట్నం: విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు



ఆమదాలవలస: మాట్లాడుతున్న అసోసియేషన్ కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు



పొందూరు: విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘ నాయకులు